# నీలి

శ్రీమతి కె. వి. యస్. అచ్యుతవల్లి

లేత నీలి టిష్యూ పరదాలోంచి పచ్చని గుండ్రని ముఖములోని చారెడేసి నల్లని కళ్లు మిలమిల్లాడుతూండగా ఒకచేతితో మృదువుగా కాశీ జరీచీర కుచ్చెళ్లు పట్టుకుని, ఇంకొక చేతితో రాంగోపాల్ చిటికెనవ్రేలు పట్టుకుని "రాగభవనం" లో గృహప్రవేశం చేసింది రాధ. అద్భుతమైన శిల్పంతో నవ్యకళ లీనవుతున్న ఆ భవన సౌందర్యంలో తను అణువైపోయినట్లు భావనరాగా కుంచించుకపోయింది రాధ. రాంగోపాలుని తన సౌందర్యారాధకుడుగా ఎరుగును. కాని ఇంత ధనవంతుడని తెలియదు. తన అదృష్టానికి తనే మురిసిపోతోంది రాధ. అతని హృదయంలో తనమీది ప్రేమ కలకాలం నిల్చిపోవాలనుకుంటున్నది. అతను పూర్ణచంద్రుడు. తను రోహిణి. అతను నారాయణుడు. తను లక్ష్మి. అతను గోపాలుడు. తను రాధ! తమ ఏకత్వంలో భిన్నత్వం రాకూడదు. తుషారబిందువులాంటి పల్చని, తెల్లని వస్త్రాలు ధరించి రాంగోపాలు బెడ్‌రూంలోనికి వెళ్లింది. ఆమెను చూస్తూనే బొటనవ్రేలితోనూ, నడిమివ్రేలితోనూ కణతలు నొక్కుకుంటూ "అబ్బా!" అన్నాడు.

"ఏమిటి!" అన్నట్లు చూసింది.

అతను మాట్లాడకుండా సోఫాలో జార్లబడ్డాడు.

"తలనొప్పా!" సన్నగా అడిగింది. పైన ఫాన్ గిరగిర తిరుగుతున్నా అతని ముఖంమీద పెదిమలపైనా మంచి ముత్యాలల్లే చెమట పట్టసాగింది. ప్రక్కన కూర్చొని అతని భుజంమీద చేయివేసి,

"మాట్లాడరూ! తలనొప్పా!" మృదువుగా అడిగింది. ఆమె కళ్లల్లోకి చూడలేనట్లు రెండు చేతులతోనూ ముఖం దాచుకుని

"రాధా! ముందు నన్ను ఎప్పటికీ వదిలిపోనని మాటియ్యి" అన్నాడు. ఎంత అమాయకత్వం! తనా! అతన్ని వదిలిపోటమా! ఎందుకని!

"మన్ని మృత్యువే వేరు పరిచేది గోపాల్" సితార్ మీటినట్లు జలజల్లాడింది.

"అయితే ఆ బట్టలు మార్చుకో!" ఆజ్ఞాపించాడు. ఆశ్చర్యపోయింది రాధ! అతనికేసి చూసింది. పచ్చని అతని ముఖం బాధతో కమిలిపోయింది. నుదుటిమీద ఆలోచనల ముడతలు! ఆ వదనం చూళ్లేకపోయింది. మధురసీమల్లో విహరించే మనస్సుని అణుచుకొని డ్రస్సింగురూంలోకి వెళ్లిపోయింది.

## 2

ఉపాహారం తీసుకువచ్చింది సూరమ్మ. ప్లేటులో రెండు ఇడ్లీ, పాలూ. రాత్రి సంఘటనలు గురించి వికలమైన మనస్సుతో యాథాలాపంగా స్పూన్ ఇడ్లీమీద గుచ్చి పంచదారకోసం చూసింది. చిన్న పింగాణి కప్పులో ఆవిర్లు వస్తూ సాంబారు కన్పించింది. "నాకు సాంబారు అక్కర్లేదు. పంచదార తీసుకురా!" సూరమ్మ మతి చలించినదానిలా వెర్రిగా చూడసాగింది. రాధకు అమితాశ్చర్యం కలిగింది.

"ఎందుకలా చూస్తావ్ నా ముఖంకేసి!"

తడబడింది సూరమ్మ. తలొంచుకుంది.

"పంచదార తీసుకురా!"

"వొద్దు వొద్దు అమ్మగారూ! అయ్యగారు కూడా వస్తారు ఫలహారానికి" వణికిపోయింది.

"వస్తే! నాకు పంచదారే ఇష్టం!"

"అయ్యగారికి ఇష్టంలేదు. మీకు ఇష్టమని తెలిస్తే బాధపడతారు."

"బాగుంది సూరమ్మా. బేషుగ్గా ఉంది. నేనుకూడా ఇడ్లీ, పంచదారతో తినకూడదన్నమాట!" పకపకా నవ్వింది రాధ. మనస్సు తేలికైంది.. గోపాలుకి అన్నీ తన యిష్టప్రకారమే జరగాలన్నమాట! తన కట్టూ బొట్టూ చివరికి తిండీ! పెద్ద జమీందారు మరి! తన సర్వస్వం గోపాలు అధీనం. తన హృదయాధినేత గోపాల్! ఇష్టంలేకపోయినా సాంబారు నంజుకు తినేసింది. గార్డెనులో మంచుబిందువులుతో తళతళ్లాడుతున్న గులాబీలు రాధని ఆహ్వానించాయి. ఎన్ని గులాబీలు! ఎన్ని గులాబీలు? అవి అన్నీ కోసేసుకుంటే ఆ మొక్కలు చిన్నబోయి తన్ని శపిస్తాయా? తోటలో గులాబీల మధ్య తిరుగసాగింది రాధ. ఎన్నో రకాల విరిసినపూలు. ఒక్క గులాబీలే పదిపదిహేను రంగుల్లో ఉన్నాయ్! అందులో ఒక్కచోట తెల్లని గులాబీలు. వంద మొక్కలు ఎన్నో లెక్కలేనన్ని పూలతో విరిసి

పోయి ఉన్నయ్ ! దూరంగా వెదురుబద్దల ఆర్చీమీద అల్మండ్ పచ్చని పూవులు రాధని చూసి సంతోషంతో వూగుతున్నాయ్. ఎర్రని ముద్ద మందారాలకు చుట్టుకున్న తెల్లని శంఖుపూలు తమ జాతీయతని చూడమంటున్నయ్. వొంపుగా ఇంద్రధనుస్సు రంగుల్లో ఉన్న బోగంవిల్లాలు "మా షోకు ముందర నువ్వెంత" అని సవాల్ చేస్తున్నాయ్. సీమ తాడి చెట్ల వలయంలో ఉన్న ఫౌంటెన్‌లోని లిల్లీలు రాధని రాగ మాలాపించమంటున్నాయి. నేలబారున నాలుగు చదరపుగజాల మేర వొత్తుగా పూసిన బొగడబంతిపూలు రాధ తమని పరిశీలించటం లేదని చిన్నబుచ్చుకున్నాయ్. కుండీల్లో అందంగా అమర్చబడిన జినియాలు, పెంకీసు రకాలు ఒక్కొక్కటీ తోట మాలి రామన్న రాధకు విశదంగా చెప్తుతూ కూడా కూడా తిరుగుతున్నాడు. ఆ తోటను అంతగా తీర్చిదిద్దిన మాలిని ఆమె ఎంతో అభినందించింది. ఆ వసంతోదయంలో ఇన్ని పూల మధ్య తిరుగుతూంటే ఆమె సంతోషంతో చేతులు బార చాపి ఎగరగల్గితే బాగుణ్ను అనుకుంది. చటుక్కున ఆమెకు తమ బెడ్‌రూంలో "వాజ్ " లో పూవు లుంచితే బాగుంటుం దని స్ఫురణకు వచ్చింది. నాలుగంటె నాలుగు తెల్ల గులాబీలు, కోసి మొక్క దవనం రెమ్మలు త్రుంచి చుట్టూ ఉంచి అరటినారతో "బొకే" గా కట్టసాగింది. రామన్న నిశ్చేష్టుడై పోయాడు.

"ఎందుకమ్మగారూ రోజాలు కోశారు !"

"ఎందుకా ! వాజ్ లో అమర్చటానికి. రామన్నా ! రోజూ ఉదయం నాకు నాలుగు తెల్ల గులాబీలు కోసియ్యి" ముద్దుగా తలాడిస్తూ అన్నది.

"అమ్మగారూ ! వాజ్ లోకి ఇంకేమన్నా పూలు కోసుకోండి. తెల్లగులాబీలు వద్దు" ముసలాడి ముఖం భీతావహమైంది.

"నాకెంతో యిష్టం తెల్ల గులాబీలు. అవే పెట్టా వాజ్ లో" పెంకెగా, అధికారంగా అంది.

"నామాటిను చిట్టితల్లీ ! అయ్యగారికి తెలిస్తే ఎంత బాధపడతారనీ" బ్రతిమిలాడాడు.

"ఏమిటి రామన్నా ! ఎన్ని కోశాననీ ? నాలుగంటే నాలుగే కదా ! అంతమాత్రానికే అయ్యగారు బాధపడతారా ? నేను కోసుకున్నానని చెప్తే ఏం అనరులే !" అర్ధాంగిని హోదాతో ధీమాగా ఉంది. ఇంక లాభంలేదు. రామన్నకి స్తిమితం తప్పింది.

"రాధమ్మా ! నామా టినరుకదూ ?" వణకిపోతున్నాడు.

"ముసలివాడవైనందుకు నీకు బాగా పిచ్చి ఉందే తాతా! ఎందుకలా వణికిపోతావ్ ! చూడకపోతే మీ అయ్యగారు డిక్టే టరులా ఉన్నారే !" హుషారుగా నవ్వుతూ "బొకే" ని మృదువుగా చెంపల కానించుకుంది. ఈమెకి చిన్నతనం వదల్లేదు. అతని బాధ తను చెప్పలేదు. చూడలేదు. స్థిరనిశ్చయుడైనాడు రామన్న. గమ్మున రాధ చేతిలోని "బొకే" ని వూడ లాక్కుని గట్టిగా రెండు చేతులతో నలిపేసి "ఫౌంటెన్" లోకి విసిరేసి పొగడచెట్లలోంచి నడుచుకుపోయాడు. రాధకు కోపం దుఃఖం వచ్చింది. ఇంక తోటలో తిరగ బుద్ధి వేయలేదు. ఆమెకు. ఈ సర్వెంట్సుకి తను యజమానురాలిగా రావటం ఏమాత్రం ఇష్టంలేనట్లు ఉంది. అందరూ తను చేసే ప్రతి పనీ విస్మితదృష్టితో చూస్తూ ఆటంకపరుస్తున్నారు. విసవిసయింట్లోకిపోయింది.

## 3

గోరువెచ్చని నీళ్లతో స్నానంచేసి, వళ్లంతా పన్నీరు జల్లిన టర్కిష్ తువ్వాలుతో తుడుచుకొని శుభ్ర వస్త్రాలను ధరించేసరికి ప్రశాంతత నొందింది ఆమె మనస్సు. అద్దం ముందు నుంచుని కూనిరాగం తీసుకుంటూ జుత్తంతా రిబ్బనుతో ముడెట్టి చెవుల వెనుక రాసుకుందామని పునుగు సీసా తీసేసరికి ఒక మృదుహస్తం పునుగు సీసా తీసుకుని "యుడికి లోన్" సీసా అందించింది. వెనక్కి కోపంగా చూసింది. సుందరి మృదువుగా నవ్వింది. రాధకు కోపం ఆగలేదు.

"నేను చేసే పనికి మీరంతా ఎందుకని అడ్డు తగులుతున్నారు ? నేనంటే మీకంత అయిష్టం ఎందుకు."

"కోపగించకండి రాధా ! పునుగు వాసన అయ్యగారికి ఇష్టం ఉండదు."

"నాకెంతో ఇష్టం ! నా ఇష్టానిష్టాలు వారికి అక్కర్లేదా ! సరే ! అడుగుతా ఆయన్నే" తిక్కగా అంది.

"అడగకండి రాధా ! ఇన్నాళ్లకి ఆయన శిశిరజీవితంలో వసంతంలా వచ్చిన మీరు ఆయన్ని వ్యథపాలు చేస్తారా ? ఆయనంటే మీకు ఆపేక్ష లేదూ ?" అనునయంగా అంది సుందరి.

"లేకేం ! నా సర్వస్వం తనే అనుకొన్నాను. ఆయన కళ్లల్లోని కరుణ కరిగిపోనిదే అనుకున్నాను. అంతేకాని స్వేచ్ఛగా ఎగిరే తూనీగని రెక్కలు విరిచి దారంకట్టి మునపట్లా ఎగరటంలేదని వాపోయే రాక్షస మనస్తత్వం అని తెలుసుకోలేక పోయాను. సుందరీ ! నిజం చెప్తున్నాను. ఇక్కడకురాని క్రితం ఎంత హాయిగా ఉండేవాళ్లమనీ ! ఆయన గొంతులో అనంతమైన ఆవేదనే కాని ఆజ్ఞలు వినిపించేవా ? ఆయన నుదుటిమీద ఆలోచనాతరంగాలు ఉండేవా? నామీది అనురాగంతో

పూర్ణచంద్రుడిలా వెలిగే నుదురు! నా సన్నిధిలో ఆనందదీప్తిలో మెరిసే చంపలతళుకులు, అబద్ధమనీ అసహజమనీ నేనెలా వూహిస్తాను చెప్పు! సుందరీ! చెప్పు! నువ్వా స్త్రీవి! నే నిక్కడుండలేను. ఈ నిర్వేదం, దుర్భరమైన నిర్వేదం నేను భరించలేను. సుందరీ! అందాలుచిందే ఈ సౌధం నా స్వప్నసౌధం కాదు. అంతర్గర్భితమైన ఆలోచనల పాముల పుట్ట!''

ఆలోచనగా వూరుకుని, కాస్సేపు నిశ్శబ్దానంతరం సుందరి ఇలా అంది :

''రాధా! ఆయన మనఃక్లేశానికి కారణాలు తెలుసు. చెప్తే మీరు తట్టుకోగల్గుతారా? ఉన్మత్తమైన మనస్సుతో ఉన్న మీరు ఆయనమీద కాఠిన్యం వూనితే ఏమయిపోతారు? ఇప్పటికే గాయపడిన ఆయన మనస్సు జన్మలో కోలుకోదు. రాధా! మీరు ఆయనపట్ల మృదువుగా సంచరిస్తానని మాట యిస్తే నేను ఆయన మనోవ్యధకి కారణం వివరిస్తాను. నామీద ఒట్టేసుకోండి రాధా!'' సుందరికేసి చూసింది రాధ. ఆమె ముఖంలో తనమీది ఆపేక్ష స్పష్టమయింది. అచేతనంగా ఆమె చేతిలో చేయి వేసింది రాధ. ఆ చేతిని అల్లానే పట్టుకుని వరాండాలోనికి వచ్చి పనిమనిషిని కేకేసి ''అయ్యగారెక్కడ!'' అన్నది సుందరి.

''షికారు కెళ్ళారు''. ''అమ్మయ్య'' అంది సుందరి. వరాండా చుట్టు తిరిగి వెనుకవైపు నున్న మెట్లు దిగి తోటలోనికి వచ్చింది. దూరంగా పూలమొక్కల మధ్య ''డోమ్'' ఆకారంలో ఉన్న ''రెస్టుహవుస్'' కేసి నిదానంగా చూసింది. ఇరువైపుల విరబూసిన పూలమొక్కల చివుళ్లని మురిపిస్తున్న లేత ఎండలో రాధ సుందరి తొందరను గమనించకుండా వయ్యారంగా నడువసాగింది.

''గమ్మున రండి రాధా'' అంది సుందరి. త్వరగా నడిచి సుందరిని జేరింది. రెండంగల్లో రెస్టుహవుస్ సమీపించి లోపలికి వెళ్లి తలుపు గడియవేసింది సుందరి. వూపిరి బిగబట్టి ఆమెను అనుసరించింది రాధ. సుందరి ముఖమూ, శరీరము చెమటతో తడిసిపోయాయి.

''చేతిలో చేయి వేశారు జ్ఞాపకం ఉందా!'' అన్నది.

''మళ్లీ అడగాలా సుందరీ! ఇచ్చినమాట తప్పను.'' రాధకు ఆమె భయానికి కారణం తెలీటంలేదు. రాధను సుందరి మేడపైకి తీసుకువెళ్లింది. దట్టమైన నీలి పరదాను తొలగించి తలుపు తాళం తీసి లోపలికి ప్రవేశించి మళ్లీ తలుపులు వేసింది సుందరి. అదొక పెద్ద హాలులా ఉన్నా పడక గదిలా ఉన్నది. వెంటిలేటర్సుకి అమర్చబడిన నీలిగాజు పలకల్లోంచి నీలికాంతులు తెల్లని చలువరాతి ధవళత్వాన్ని నీలి రంగులోకి మార్చటానికి వృథా ప్రయత్నాలు చేస్తూ పైనించి సగందాకా ఏటవాలుగా వచ్చి ఆగిపోతున్నాయ్. సోఫాలు, ముఖమలు దిండ్లతో ఉన్న శయ్య! తూర్పు గోడకి ''రాయ్ రిచ్'' చిత్రించిన లైఫ్ సైజు దేవికారాణి త్రివర్ణచిత్రం, పడమర గోడకి నాలుగు అరలున్న రోజ్ వుడ్ బీరువా! అది తీసింది సుందరి. తెల్లని పల్చని జరీచీరలు, ముఖమల్, కంచి, పట్టు, బ్లౌజులు వడిలిపోయిన తెల్ల గులాబీలు! పై అరలో ఆల్బంలు అయిదారు ఉన్నయ్. ఒకటితీసి చూసింది రాధ. కాష్మీరు, కులూ, సిమ్లా, డార్జిలింగ్, కన్యాకుమారి మొదలైన స్థలాల ప్రకృతి ఛాయాచిత్రాలు పొందుపరచిఉన్నాయ్! ఇంకొకటి తీసి చూసింది రాధ! అందులో ''కన్హేరీ, ఎలిఫెంటా, అజంతా, ఎల్లోరా, మహాబలిపురం మొదలైన సుందర శిల్పాల ప్రతిచిత్రాలు ఉన్నాయ్. ప్రతి చిత్రం కిందా డ్రాయింగుపేపరు మీద, ఇండియన్ ఇంక్‌తో చిత్రాల వివరాలు అవీ చూసినప్పుడు తను పొందే అనుభూతులన్నీ పొందికగా వ్రాసుకున్నాడు రాంగోపాలు! అతనిలోని కళాహృదయానికి జోహార్లర్పిస్తూ ఇంకొక ఆల్బం తీసింది రాధ. సుందరి స్థాణువులా నిలబడింది. మొదటిపేజీలో అరచేయి అంత నీలి ముఖమలు గుడ్డమీద జలతారులతలమధ్య చిన్న ఫోటో అంటించి ఉన్నది. తెల్లగా పల్చగా శరీరం వంపులు వ్యక్తమయ్యే వస్త్రం! స్లీవ్‌లెస్ బ్లౌజ్ భుజాలమీదికి కెరటాల్లా పడే జుత్తు! చెవి ప్రక్కగా రెండు ఆకులతో ఉన్న తెల్ల గులాబీ! ఆచ్ఛాదనలేక నున్నగా ఎత్తుగా ఉన్న భుజంమీదికి వాలుచూపు! చారెడేసి నల్లని కళ్లకి నల్లని సన్నని పట్టుదారాలతో అల్లిన జాలర్లాంటి కనురెప్పలు! రాధ పేజీలు తిరగేసింది. అన్నిట ఆ అద్భుత సౌందర్యరాశి రకరకాల భంగిమల ఛాయాచిత్రాలు. ఆఖరుపేజీలో అందాలరాణి మెడలో మోయలేనన్ని పూలహారాలతో సోలిపోతున్నట్లు భువనమోహనంగా రాంగోపాలు భుజాన్ని వూతగానించున్న వివాహచిత్రం! క్రింద ''నీలి'' అనుగ్రహించిన ''రాధిక'' అని ఉంది. రాంగోపాల్ సౌందర్యార్చన ఎంత ఉన్నతమైనదో గ్రహించిన రాధ కళ్లు చమరించాయి.

''రాధా! నీలమ్మలోని అందాలు మీలో చూసినారు. కనుకనే అయ్యగారు మళ్లీ జీవించకల్గుతున్నారు. మిమ్మల్ని ఆరాధించుతున్నారు. రాధా! ఆమె శరీరమే అందమైనది అనుకోకు. ఆత్మ అంతకు వెయ్యిరెట్లు దయాపూరితమైనది. అందాలరాణుల కుండాల్సిన గర్వం ఆమెలో అణుమాత్రం లేదు. ఆమె ఎనలేని అనురాగంతో మమ్మల్ని అలరించింది. ఈ భవనం ప్రతి అంగుళమూ ఆమె పదస్పర్శచేత పునీతమైంది. అయ్యగారిని దివ్యలోకాలను స్పర్శించేట్లు చేసింది.

ఆయన పుట్టిన రోజున పనివాళ్లందరికీ దోసెడేసి మంచి ముత్యాలు పంచిపెట్టేది. తోటలో ప్రత్యేకం వంద తెల్ల గులాబీ మొక్కలను ఆమె స్వయంగా పెంచింది. ఆమె పవిత్రమైన గంగానది లాంటిది. ఆమెకు పుట్టింటారు ఉన్నారో! లేరో! మాకు తెలీదు. నాలుగేళ్లు మమ్మల్ని ఆనందాల్లో సుందర స్వప్నసీమల్లో విహరింపచేసిన అందాలరాణి ఆమె!" సుందరి కళ్లు అశ్రుపూరితా లయ్యాయి. దోసిట్లో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది. రాధ ఆమె తల ఆప్యాయంగా నిమిరింది.

"సుందరీ! నాకూ యిదంతా వింటుంటే అమిత వ్యథ కలుగుతూంది. ఆమె అనురాగమయి, సౌందర్యవతి, మృదు స్వభావ కనుకనే మీ హృదయాలలో ఇంత గాఢముద్ర వేసుకో గలిగింది. అక్క చనిపోయి ఎంతకాల మయిందీ" అంది రాధ బాధగా.

"ఆరేళ్లయింది రాధా! ఆరేళ్లయింది. ఈ ఆరేళ్ల ల్లోనూ అయ్యగారికి మతి భ్రమిస్తుందేమో అన్నంత భయం వేసేది. ఆమె జ్ఞాపకాలు రాకుండా చేయటానికి మేము ఎంతో ప్రయత్నించాము. ఎవరితరం? మా జీవితాలే నీలమ్మగారి ఆదరణతో నిండి మరిచిపోలేని బాధను కలుగజేస్తూంటే జీవితభాగస్వామిని, సహధర్మచారిణి అయిన ఆమెలేని లోటును అయ్యగారిదరి చేరకుండా చేయగలమా రాధా! నీలిస్మృతులతో ఆయన బాధపడలేక ఈ భవనానికే రావటం మానుకున్నారు. అలా పిచ్చి పట్టినట్లు దేశాలు తిరిగారు. ఆయన జీవితం గురించి ఎంత బెంగపడ్డామో రాధా! పోయిన నెల ఆయన వచ్చి మీకు కొత్త యజమానురాలు వస్తుందని చెప్పినప్పుడు ఎంత ఆనందించామో! రాధా! మీరు మేలి ముసుగుతో లోపలికి వస్తున్నప్పుడు, మళ్లీ నీలమ్మగారే బ్రతికివచ్చారా! అని ఆశ్చర్యపోయాము. ఆయన హృదయం గాయాన్ని మాన్ప శక్తి మీ కొక్కరికే ఉంది. ఆయన మనస్సు ప్రశాంతత పొందటానికే దయామయుడైన భగవంతుడు మిమ్మల్ని సృష్టి చేసి ఆయన కంటపడేట్లు చేశాడు. రాధా! నీలి గురించి మీతో చెప్పవద్దన్నారు. ఆమె స్మృతినుండి కోలుకోవటానికే రాధను తీసుకువచ్చాను అన్నారు. నీలిస్మృతిని ఎలా మభ్య పెట్టగలము? నీలిలాగే మీకూ అన్నీ ఆమె అలవాట్లే అయి నందుకు పనివారంతా దిగ్భ్రమ చెందుతున్నారు. ఆయన్ని నీలి స్మృతులు కలవరపెడతాయనీ ఆమె కిష్టమయిన విష యాలు మీనుండి వేరుపర్చాలనీ చెప్పారు. రాధా! అందు వల్లనే మేము మీతో అలా ప్రవర్తించవలసి వచ్చింది. మీరంటే మాకు ఎంతో ప్రేమాభిమానా లున్నాయ్. అయ్యగారిని భరించలేని విషాదంలోంచి తప్పించే అమృతమూర్తి మీరు! రాధా! మీ మనస్సు గాయపట్టం భరించలేక అయ్యగారి ఆజ్ఞను అతిక్రమించాల్సి వొచ్చింది. మీరు ఈ విషయం తెలియనట్లు ఆయనపట్ల సంచరించాలి. ఒట్టు వేశారు!" రాధ చేతుల్ని గట్టిగా పట్టుకుంది. గాఢంగా నిట్టూర్చింది.

"సుందరీ! అక్క చనిపోలేదు. ఆమె అమరత్వం పొందింది. మన అందరి హృదయాలలో స్థిరంగా నిల్చి పోయిన జీవనజ్యోతి! అక్కా! నన్నాశీర్వదించు! నీ అడుగు జాడల్లో నడువటానికి ప్రయత్నిస్తాను". నీలి చిత్రాన్ని కళ్ల కద్దుకుని ఇవతలికి వచ్చింది రాధ.

## 4

రాంగోపాలు నీలిని అత్యధికంగా ప్రేమించాడు. విధి ప్రతికూలించి నీలి అతన్ని ఒంటిగా చేసింది. నీలిలోని అందా లను సంతరించుకున్న రాధను ఉన్మత్తంగా ఆరాధిస్తున్నాడు. ఆ ఆరాధనలో రాధకు వేరే అభిరుచు లుండకూడదు. తన నీడలా ఉండాలి అనే ఆధిక్యత గోచరించింది రాధకు. భర్త ఆధిక్యత భరించలేకపోతున్నది. ఇటు భవనం అంతా నీలి స్మృతుల జాలంలో ఉన్నది. రాధకు తన అస్తిత్వము మీది నమ్మకము పోతోంది. తన భాగ్యనిధి సన్నిధిలో కొంచెం సంతోష పారవశ్యం అనుభవించినా ఇవతలికి వచ్చేసరికి మామూలు నిరాశ నిస్పృహలు ఆమెను అలముకొనేవి. ఎంత ప్రయత్నించినా రాధ పనివాళ్ల మనస్సుల్లోంచి నీలి చిత్రాన్ని చెరిపివేసి తన్ని ప్రతిష్ఠించుకోలేక పోతూంది. పండుగలప్పుడు పనివాళ్లందరికీ కొత్త బట్టలూ, స్వీట్సూ పంచిపెట్టేది.

వాళ్లు "నీలమ్మగా రిలాగే ఎంతో దయగా ఉండే వారు" అనేవాళ్లు. తను పాడినా, ఆడినా, మాట్లాడినా "నీలమ్మగారిలాగే" అంటూండేవాళ్లు. ఈ సపత్నీత్వం రాధ భరించలేకపోయేది. ఆమెకి నీలి ప్రశంస వింటూంటే అగ్ని జ్వాలల్లో దగ్ధమవుతున్న ట్లుండేది. పోనీ బ్రతికుందా నీలి! చనిపోయిన స్త్రీప్రశంసే వినలేనంతగాఢంగా ఆరాధించిందా తను గోపాల్ని!" పోనీ తను చచ్చిపోతే ఈ ప్రశంస వినక్క ర్లేదేమో! అనుకునేది కచ్చగా. అప్పుడు కూడా "నీలమ్మ గారిలాగే రాధమ్మగారు కూడా చాలా మంచివారు" అని అనుకో రని నమ్మక మేమిటి? చచ్చినా తన ఆత్మ ఈ ప్రశంస విని సంతోషిస్తుందా! భగవాన్! తనకీ నరకయాతన తప్పదా? ప్రేమ! పెళ్లి! తన సుందరస్వప్నం కరిగిపోటానికే ఇక్కడికి వచ్చిందా? ఈ నిజం తెలియకుండా ఉంటే ఎంత బాగుం డును? నీలిస్మరణ చెవులకి వినపడని సుదూరతీరాలకి తను రామ్‌గోపాలుని తీసుకపోతే ఎంత బాగుంటుందీ! రాంగోపాలు

మాత్రం నీలిస్మృతుల పునశ్చరణ కోసమే తన్ని ఇక్కడికి తీసుకువచ్చాడా ? తన సన్నిధిలో ఆయనకీ ఆలోచన్లు ఎందుకు? ఉండుండి ఉలికిపాటు ఎందుకు ?

టెర్రేస్‌లో పర్షియన్ రగ్గుమీద బాలీసు కానుకుని రాధ యివన్నీ ఆలోచించుకుంటున్నది. ఒడిలో వీణ ఉన్నది. తెలిమబ్బుల్ని కదిలించే నిండు చంద్రుడు తనలోని నల్లని మచ్చని అందమైన రాధ గమనించటం చూసి గాభరాగా మబ్బు చాటుకి తప్పుకోబోతున్నాడు. అతని చల్లని వెన్నెలకి కరగిపోతున్న మబ్బులు "నీ రహస్యం నీవే చెప్పుకో ! మా చాటున ముఖం దాచుకుంటా వెందుకు ?" అన్నట్లు దూరంగా తప్పుకుంటున్నాయి. అలా తదేకంగా చూస్తున్న రాధ రాంగోపాలు వచ్చి పిట్టగోడ కానుకుని నించున్నట్లు గమనించకుండా వీణను శ్రుతిచేసి మీటుతూ సారంగరాగ మాలాపించి ఇలా పాడింది.

అఙ్కంకేపి శశఙ్కరే, జలనిధేః
పఙ్కం పరే మేనిరే,
సారఙ్గం కతిచిచ్చ సంజగదిరే,
భూచ్ఛాయ మైచ్ఛన్ పరే,
ఇన్దౌ యద్దళి తేన్ద్ర నీలశకల
శ్యామం దరీ దృశ్యతే,
తత్ సాన్ద్రం నిశి పీత మన్ధతమసం,
కుక్షిస్థ మాచక్ష్మహే.

'ఆ చంద్రునిలో ఉన్న నలుపు కొందరు మచ్చగా భ్రమించిరి. సముద్రము బురదగా కొందరు తలంచిరి. కొందరేమో లేడి అని పలికిరి. కొందరు భూమి నీడ అంటారు. మేము రాత్రి చీకటిని త్రాగుటచేత దట్టమయిన చీకటి కడుపులో ఉండిపోయింది అనుకుంటున్నాము.'

"హు" గాఢమైన నిట్టూర్పు విని వెనక్కి తిరిగి చూసింది రాధ. వీణ తాళం తీగలు చిటికెనవ్రేలితో మీటుతూ అలానే కూర్చుండిపోయింది.

"నీకంతా తెలిసిందన్నమాట."

రాధ మాట్లాడలేదు. మౌనంగా కూర్చుండిపోయింది.

"రాధా ! బాధపడుతున్నావా ?" గొంతులో జీర విన్పించింది.

రాధకు మౌనమే భూషణం !

"ఈ సంపదంతా నాది అని తెలిసుండీ ఇది లేకుండా నాతో ఉండగలవా ?" ఎందుకీ యక్షప్రశ్నలూ ? కొరడా దెబ్బ తిన్నట్లయింది రాధకు. "మీరు పరిచయమైనప్పుడు ఇంత సిరికలవారుగా ప్రవర్తించలేదు. మర్చిపోయారా ?" దుఃఖంగా అంది.

"అయితే ఇల్లా రా ?" లేచి దగ్గరగా నడిచింది. ఆమె నడుము చుట్టూ చేయివేసి "పద" అన్నాడు. అనుసరించింది రాధ. ఇద్దరూ వెన్నెల వర్షానికి చలించిపోతున్న పూలరెమ్మల మధ్యనించి నడిచి "రెస్ట్‌హవున్" లోకి వెళ్లారు. వరసాగా ఉన్న గదులన్నీ దాటి "నీలి బెడ్‌రూం" లోనికి తీసుకవెళ్ళాడు. "రోజ్‌వుడ్" బీరువా తీసి పది వజ్రాలు జేబులో వేసుకున్నాడు. రాధ దిగ్భ్రమ చెందింది. నెమ్మదిగా రాధ కళ్ల ముందు మర్నాడు "జలరాణి" లో బయలుదేరుటకు రిజర్వు చేయబడిన రెండు పాస్‌పోర్టులు ఆడించాడు. రాధ సంతోషంతో రెండు చేతులూ చెంపల కదుముకుంటూ "అబ్బ!" అంది. రాంగోపాలు అంతతో వూరుకోలేదు. మంచంమీది పరుపులు, ముఖమల్ దిండ్లు చాకుతో కోసి అందులో ఉన్న పట్టు, దూది, తివాసీ నడుంగా కుప్ప వేశాడు. దానిమీద "నీలి" ఫోటోలున్న ఆల్బం. ఎండి వాడిపోయిన తెల్ల గులాబీలు పడవేశాడు. "సిగరెట్ లైటర్" సహాయంతో అది అంటించబోయే సమయానికి రాధ అతని చేయి పట్టుకుని మృదువుగా వారించింది.

"ఏంపనీ ! 'నీలి' స్మృతుల గురించి అసూయ పడుతున్నా నన్నుకున్నారా ?"

"హు. అసూయని కాదు. ఆ ఆలోచనలే అనుసరిస్తే నేను బ్రతుకలేను."

"మీ అభిమానమే నన్ను చిరంజీవిగా చేస్తుంది" కృతజ్ఞతగా అన్నది. రాంగోపాలు క్షణం నిశ్శబ్దంగా వూరుకున్నాడు. అతని ఫాలభాగము ఆలోచనలుతో ముడుతలు పడసాగింది. గట్టిగా వూపిరి విడిచి ఒక టెలిగ్రాం కాగితం ఆమెకు అందించాడు. ఏముంది అందులో ! రాధ జీవిత మూలమే కదిలించేదుందా ?

"ఆల్బర్ట్‌తో వస్తున్నాను. నీలి".

రాధ అచేతనమైపోయింది. నమ్మాలా ? నమ్మకూడదా ? తల గిరగిర తిరిగిపోగా దూది కుప్పమీద కూలబడి వెక్కివెక్కి ఏడ్వసాగింది. దూరంగా వూరి కావతల గుడిసెల్లో "కొక్కొరోకో" అని సుషుప్తావస్థలోనున్న జగతిని జాగ్రదవస్థలోనికి తేవటానికి ప్రథమ సహాయకులు పాటుపడుతున్నాయి. రాంగోపాలు ఈ సూచన విని గాభరాపడ్డాడు.

"ఒక్కమాట విన్పించుకో రాధా ! టైం లేదు. మరి".

రాధ మాట్లాడలేదు. ఆమె కళ్లు వరిసిపోయినట్లు ఎర్రగా ఉన్నాయి. ఆమె కన్నీళ్లన్నీ ఇంకిపోయినట్లుగా వెక్కుతున్నా కన్నీళ్లు రావటంలేదు. చెంపలు ఎండిపోయాయ్.

"నన్ను నమ్మ !"

రాధకి అతని మాటలు విన్పించుకోవాలన్న ధ్యాస లేనట్లు శూన్యంగా "దేవికారాణి" చిత్రంకేసి చూస్తూ కూర్చుంది. అయినా సరే చెప్పుకపోయాడు రాంగోపాలు. "తన ఆంతరంగిక వ్యథలు వినేనా ఈ దేవత కరుణించకపోతుందా?" అన్నట్లు చెప్పుకపోయాడు.

"నీలి" ని ఒకసారి హొటల్లో కలుసుకున్నాను. ఆమె అత్యద్భుత సౌందర్యానికి ముగ్ధుడనై, మేరేజ్ కి ప్రపోజ్ చేశాను. ఆమె వెంటనే ఒప్పుకుంది. తొలిరాత్రి మాపాలిటి కాళరాత్రయింది. ఆమె విశ్వరూపం పరిశీలించాను. ఆమె అమృతమూర్తి కాదు. కామినీ పిశాచి ! స్వైరిణి ! ఛీ ఛీ ! నా వంశం ఎక్కడ ! ఆమె ఎక్కడ ! భగవాన్ నాకెందుకు పెట్టావు ఈ పరీక్ష ! నా గుండె ఆమెయందు విపరీతమైన ద్వేషంతో మండిపోసాగింది. ఆమె శరీరం అంతా తూట్లు తూట్లుగా గాయపరచాలనిపించింది. నౌకర్లందరూ ఆమెని జమీందారిణిగా గౌరవిస్తూంటే ఆమె నీచ జీవితం గురించి గట్టిగా అరవాలనిపించేది. నే నిలా దుర్భర మనోవేదనతో నా నూరేళ్ల జీవితంగురించి యాతనపడుతూంటే ఆమె మాత్రం నిశ్చింతగా తిరిగేది. డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుతూ విందులూ వినోదాలూ ఏర్పాటు చేసేది. వూరంతా నీలా రాంగోపాలు సౌందర్యాన్ని దర్పాన్ని సహృదయతనీ మెచ్చుకునేవారు. తను ఈ ఇంటికి రాణి ! అన్న గర్వంతో ఇల్లంతా తన యిష్టం వచ్చినట్లు అలంకరించింది. నేను చేతకానివాణ్ణయి పోయాను. ఆమెను ఏంచేయటానికీ పాలుపోలేదు. నా వంశం, గౌరవము, ప్రతిష్ఠ, ఈ బజారు మనిషివల్ల కూలిపోయాయి ! ఆమె నా భార్య ! నా గృహిణి ! అబ్బా ! నాలుగేళ్లు, నాలుగేళ్లు అలా యమలోకంలో గడిపాను. ఒకనాడు ఆమె నాతో అన్నది.

"నీ కరుణ నా కక్కర్లేదు. నాకొక అయిదు లక్షలు ఇచ్చావంటే నా దారిని నేను పోతాను. జన్మలో నా ముఖం నీకు చూపెట్టాల్సిన అవసరం కలగకుండా చూసుకుంటాను."

"నిన్ను విషతుల్యంగా చూస్తున్నాను. నువ్వు నాకు చచ్చిపోయినట్లు జమ. ఆ విషయం నలుగురికీ తెలిసేటట్లు చేస్తాను. ఒప్పుకుంటే నువ్వు అడిగిన డబ్బు యిస్తాను." ఆమె హేళనగా నవ్వింది.

"నిన్ను ముందు ముందు ఇబ్బందుల్లో పెడతానన్కొన్నావా ! నువ్వంటే నాకు చెడ్డ అసహ్యం. నా జీవితం గురించి విన్నప్పుడు ముడుచుకుపోయిన నీ ముఖం చూడగానే నాకు నువ్వంటే చెప్పలేని ద్వేషం కలిగింది. అందుకే ఈ నాలుగేళ్లబట్టీ, నీవ్యథ చూస్తూ ఇక్కడ జమీందారిణిగా గడిపాను. నువ్వే నీతిమంతుడివా ? నాకు డబ్బే ప్రధానం. అందుకే నువ్వు నన్ను పెళ్లిచేసుకోమని కోరగానే ఒప్పుకున్నాను. ఆ డబ్బు నాకు ఇచ్చావంటే నీ జీవితం జోలి నా కక్కర్లేదు." నాలుగేళ్లల్లోనూ నేను ఆమె వంటిమీద చేయివేసిన పాపాన్న పోలేదు. ఆమె దగ్గరికి వస్తే నాకు రోత ! తెల్లని గులాబీల్లో తెల్లని వస్త్రాలలో దూరంగా ఉన్నప్పుడు ఆమె దేవ కన్యలా కనుపించేది ! విషపూరితమైన ఆ సౌందర్యాన్ని చూస్తూ అల్లానే రోజులు గడిపాను. నేను సూచించిన ప్రకారం ఆమెను నేను 'బాంబే' రేసెస్‌కి వెళ్తున్నామని చెప్పి తీసుకుపోయాను. అక్కడ ఆమె సడన్‌గా "కొలాప్స్" అయిందని పుట్టెడు దుఃఖంతో మునిగిపోయినట్లు ఇంటికి వచ్చాను. కాని లోపల్లోపల ఆమె మళ్లీ డబ్బంతా ఖర్చు పెట్టేసుకుని వచ్చి ఏడుస్తుందనే భయంతో కృంగిపోయి దేశాలు తిరిగాను."

హఠాత్తుగా రాధ అడిగింది.

"మరి ! మరి ! నన్నంతా ఆమె పోలికే అంటారు ! మీరెలా ..........

"అవును. నువ్వంతా ఆమె పోలికే ! నిన్ను మొదట చూసినప్పుడు ఆమె అనే భ్రాంతిలో పడ్డాను. ఆమెను హత్యచేయాలన్నంత కసి ఉండేది. అంచేత నీ వెంట పడి నిన్ను గురించి ఆరా తీశాను. ఆమె అయితే చంపేసి పారిపోదా మనుకున్నాను. కాని నువ్వు సామాన్యస్త్రీవి అని తెలిసినప్పుడు నిన్ను ఆరాధించటం మొదలెట్టాను. నాకు ఆమె సౌందర్యం కావాలి ! కాని పవిత్రంగా మనఃస్ఫూర్తిగా నన్ను ప్రేమించాలి. నా అదృష్టంకొద్దీ నువ్వు దొరికావు ?"

"నాకూ తెల్లగులాబీలన్నా అన్నీ ఆమె అలవాట్లన్నా అమితమయిన యిష్టంకదా? అవి మీరెందుకు వారించారు ?"

"విశృంఖల మనస్తత్వంతో సంచరించే ఆమె అలవాట్లు నాకు ప్రాణాంతకంగా ఉండేవి. అవి నీలో ఉంటం నేను భరించలేక పనివాళ్లందరికీ నిన్ను వారించమని చెప్పాను. వాళ్లంతా నాకు "నీలి" మీదున్న మరచిపోలేని మమతకు ఎంతో దుఃఖించటం చూచి నాలో నేనే నవ్వుకున్నాను. నిన్ను ఈ విషవలయంలోకి తీసుకొనిరాకపోదును. మానేజరు ఒకసారి వచ్చి జమీ వివరాలు చూసుకొమ్మని టెలిగ్రాం యిచ్చాడు. నిన్ను వదలి ఉండలేక తీసుకవచ్చాను. రాధా ! నువ్వు నీలి అమర

త్వంతో విషాదం పొందుతూంటే ఎంత జాలి వేసేదో! పని వాళ్లకి నీలి దేవత ! వాళ్లదాకా మా అంతరంగిక రహస్యాలు పోనీయలేదు. ఇక్కడ వాళ్లంతా మమ్మల్ని శివ పార్వతు లనుకొనేవాళ్లు. ఆమెమీది పగతో నేను దేశాలు తిరుగుతూ న్నప్పుడు ఇక్కడివాళ్లు ఆమెమీది అవ్యాజానురాగంవల్ల విరాగినై పోతున్నానని బాధపడి నాకు నీతులు బోధించేవారు.

"ఆమె వస్తుందంటారా ?"

"వస్తుందా అంటావా ! అమాయకురాలివి. ఆమె తప్పకుండా వస్తుంది. నన్ను నవ్వులపాలు చేయటం ఆమెకు ఎంతో సరదా ! పైగా ఆమెకు అవసరం కూడా ఉన్నది."

"ఆల్బర్టు ఎవరు."

"ఎవరంటే ఏం చెప్పను రాధా! ఆమెఎడమకాలి బంటు.

"ఛీ ! ఛీ!" తటాలున ఆమెకు వచ్చిన కొత్తలో నీలి చిత్రాన్ని తను కళ్ల కద్దుకుని "నీ అడుగుజాడలో నడుస్తాను, ఆశీర్వదించు" అన్న తన పలుకులు జ్ఞాపకానికి వచ్చి వళ్లు ముడుచుకుపోయింది.

"ఆమెకు ఆరోమాసంట !"

రాధ ఆశ్చర్యపోయింది.

"కడుపులో ఉన్న తన పసిపాప తన కళ్ళు తెరిపించిందట. వ్రాతమూలకంగా వితాకులు లేనందున ఆ 'బేబీ' ని నాదిగా నిరూపించి జమీకి వారసత్వం నిలబెట్టుందట! ఆ విషయాలు మాట్లాడుతాను. అందుకని "ఆల్బర్టుతో వస్తున్నానని" వ్రాసింది. "ఈ సుందర రాజ సౌధంలో ఎలాంటి విషపూరిత వాతావరణం నిండుకున్నదీ !" అనుకున్నది రాధ.

"మరి కర్తవ్యం!"

"చెప్పాగా ! నా అస్తిత్వం నేను భరించలేక పోతున్నాను. ఈ దూదికుప్ప సాయంతో ఇల్లు అంటించేస్తాను. నేను అప్పుడప్పుడు ఇక్కడ నీలి స్మృతుల్లో విహరిస్తానని మా నౌకర్లందరికీ తెలుసు. ఈ మంటల్లో నేను దగ్ధమైపోయాయని విచారిస్తూ అశ్రుతర్పణం విడిచేస్తారు" రాధ కళ్ళు జలపూరితా లవుతూంటే రాంగోపాలు నోటిమీద చేయి వేసింది.

"ఆమె వస్తే !" ప్రశ్నతో నిలేసింది.

"వస్తే ఉంటుంది. లేకపోతే భవనం మాత్రమే మిగిలిన జమీ అమ్మేసుకపోతుంది. లేకపోతే దయ్యమని "సీసా" లోకి దింపేస్తారు. ఇక్కడివాళ్లకి నమ్మకాలు ఎక్కువ ! పద! పద! తెల్లారిపోతుంది!" ఆమె రెండు చేతులూ పుచ్చుకుని లేవదీశాడు. రాధ గది అంతా నిస్త్రాణగా కలయచూస్తూ నిలబడిపోయింది.

"నీకుకూడా ధనంమీద లాలసత్వం కలుగుతోందా ?"

"నాకు నిధి అక్కర్లేదు. మీ సన్నిధి చాలు!"

దూదికుప్ప భగ్గుమన్నది. ఆ మంటలు విపరీతమైన ఆకలితో క్రమక్రమంగా బీరువాల్ని కిటికీ రెక్కల్ని మంచాన్ని సోఫాల్ని నాలుకలు చాచుతూ అంటుకున్నాయి. వెనుక గుమ్మంలోంచి వారిద్దరూ ఉషాకన్యాగమనాన్ని సహించలేక త్వరత్వరగా తోటలోంచి నడుచుకుపోయారు. రాగ భవనంలో నౌకర్ల రోదన ధ్వని మింటి కెగసిపోగా సూర్యుడు పలకరించటానికని ఉదయించబోతున్నాడు!